తీరని వేతనాల వెతలు

- గూడవల్లి పంచాయతీ కార్మికుల ఆవేదన
- కార్మికుల పొట్టకొడుతున్న బినామీ టెండర్లు
- అమలు కాని కనీస వేతన జీవో



వేతనాలు పెంచాలని డిమాండ్ చేస్తూ నిరసన వ్యక్తం చేస్తున్న కార్మికులు (ఫైల్)

రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలం గూడవల్లి పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులు తమకు కనీస వేతనాలు పెంచాలని దీర్ఘకాలంగా చేస్తున్న డిమాండ్ నెరవేరటం లేదు. రూరల్ మండలంలోని గ్రామాలన్నింటితో పోలిస్తే గూడవల్లి పంచాయతీలో పని చేసే కార్మికులకు తక్కువ వేతనాన్ని చెల్లిస్తున్నారు. దీంతో ఎప్పటి నుంచో కార్మికులు తమకు కనీస వేతన జీవో అమలు చేయాలని కోరుతూ ఆందోళన చేసినా, అధికారులకు వినతి పత్రాలు సమర్పించినా వీరి వేతనాల వెతలు తీరడం లేదు.

35 మందికి పైగా కార్మికులు..

మేజర్ పంచాయతీ అయిన గూడవల్లిలో సుమారు 35 మందికి పైగా కార్మికులు విధులు నిర్వహిస్తున్నారు. జాతీయరహదారికి ఆనుకుని ఉన్న గ్రామం కావడంతో కార్మికులపై పనిభారం కూడా ఎక్కువే. ఈ నేపథ్యంలో వారికి నెలకు అత్యల్పంగా రూ.8,250 జీతం చెల్లిస్తున్నారు. చాలని ఈ జీతంతో నెలవారీ జీవనం ఎలా గడపాలని వీరు ప్రశ్నిస్తున్నారు. క్రమేణా పెరుగుతున్న నిత్యావసర ధరలు, విద్యుత్ బిల్లులు, అద్దెలు, పిల్లల స్కూలు ఫీజులతో నానా అగచాట్లు పడాల్సి వస్తోందని తమ బాధలు వ్యక్తపరుస్తున్నారు. వేతనాలు పెంచాలని ఎప్పటి నుంచో మొత్తుకుంటున్నా తమ బాధలు ఎవరికీ పట్టడం లేదని ఆరోపిస్తున్నారు. ఈ నేపథ్యంలో వేతనాల కమిటీ ప్రకారం జీతాలు చెల్లించాలని వీరు డిమాండ్ చేస్తున్నారు.

పక్క గ్రామాల్లో రూ.13 వేలు ఇక్కడ రూ.8 వేలు..

విజయవాడరూరల్ మండలం జాతీయరహదారికి ఆనుకుని వరుసగా రామవరప్పాడు, ప్రసాదంపాడు, ఎనికేపాడు, నిడమానూరు, గూడవల్లి గ్రామాలు ఉన్నాయి. ఈ గ్రామాలన్నీ మేజర్ పంచాయతీలైనప్పటికీ ఒక్క గూడవల్లి గ్రామానికి మాత్రమే అత్యంత తక్కువ వేతనం చెల్లిస్తున్నారని వారు ఆవేదన చెందుతున్నారు.

పక్క గ్రామాల్లో ఇలా..

రామవరప్పాడులో పారిశుద్ధ్య కార్మికులకు నెల వేతనం రూ.13 వేలు, ప్రసాదంపాడు రూ.13 వేలు, ఎనికేపాడు రూ.13 వేలు, నిడమానూరు రూ. 13 వేలు చెల్లిస్తున్నారు. కాగా గూడవల్లిలో మాత్రం నెలకు రూ. 8,250 చెల్లిస్తున్నారని కార్మికులు ఆందోళన బాట పట్టారు.

బినామీలతో టెండర్లు..

ప్రభుత్వం కనీస వేతనం నెలకు రూ.10 వేలు ఇవ్వాలని 2019న జీవో విడుదల చేసినా ఈ పంచాయతీకి మాత్రం పట్టడం లేదు. కనీస వేతన జీవో అమలు చేయాలని కార్మికులు డిమాండ్ చేస్తున్నా పట్టించుకున్న దాఖలాలు లేవు. కాగా తాజాగా 2025- 26 సంవత్సరాలకు గానూ గ్రామంలో పారిశుద్ధ్య పనులు నిర్వహించేందుకు పంచాయతీ టెండర్లు ఆహ్వానించింది. దీంతో గ్రామానికి చెందిన ఓ వ్యక్తి తన కుటుంబ సభ్యులు, తన పేరిట కలిపి మూడు టెండర్లు వేశాడు. వీటిని కలుపుకుని మరో రెండు టెండర్లు వచ్చాయి. ఎలాగైనా టెండర్ చేజిక్కించుకోవాలన్న దురుద్దేశంతో కుమ్మక్కై, బినామీ పేర్లతో టెండర్లు వేస్తున్నారని కార్మికులు ఆరోపిస్తున్నారు. ఎప్పటి నుంచో వేతనాలు పెంచాలని డిమాండ్ చేస్తున్న కార్మికులకు ఈ సారి కూడా అన్యాయం జరుగుతుందని గ్రహించి ఆందోళన బాట పట్టారు. ఇటీవల పారిశుద్ధ్య కార్మికులు విధులు బహిష్కరించి పంచాయతీ కార్యాలయం వద్ద బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. దీంతో పంచాయతీ పెద్దలు నచ్చజెప్పి ప్రస్తుతానికి ఆందోళన విరమింపజేశారు.

సమావేశం నిర్వహించి నిర్ణయం..

పారిశుద్ధ్య కార్మికుల వేతనాల సమస్యపై పాలకవర్గ సమావేశం నిర్వహించి నిర్ణయం తీసుకుంటాం. తాజాగా వేసిన టెండర్లలో ఓ వ్యక్తి అత్యల్పంగా రోజుకు రూ.250కు టెండర్ వేయడంతో కార్మికులు ఆందోళన బాట పట్టారు. వీరి సమస్య పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటాం.

– చింతలమ్మ, పంచాయతీ కార్యదర్శి

క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పెనమలూరు: యనమలకుదురు గ్రామంలో గురువారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఈఈ ఆపరేషన్స్ పి.హరిబాబు అన్నారు. ఆయన బుధవారం వివరాలు తెలుపుతూ గురువారం ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకు విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తామన్నారు. బోసుబొమ్మ సెంటర్, సంజీవయ్యనగర్, లంబాడీపేట, డబ్బాపంపు సెంటర్, రామాలయం, అవనిగడ్డ కరకట్ట ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తామన్నారు. గ్రామస్తులు తమ సిబ్బందితో సహకరించాలని కోరారు.

ఎన్ఆర్ఈజీఎస్ ఉద్యోగుల బదిలీలు

విజయవాడరూరల్: విజయవాడ రూరల్ మండలంలో జాతీయ ఉపాధి హామీ పథకం ఉద్యోగుల బదిలీలు జరిగినట్లు ఇన్‌చార్జి ఎంపీడీఓ పి.మురళీకృష్ణప్రసాద్ బుధవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ఏపీఓగా డ్వామా కార్యాలయంలో పనిచేస్తున్న రాజమౌళి మండల కార్యాలయానికి బదిలీపై వచ్చారు. ఇంజినీరింగ్ కన్సల్టెంటుగా పని చేస్తున్న కె.శ్రీనివాస్ రెడ్డిగూడెం మండలానికి బదిలీ అయ్యారు. టెక్నికల్ అసిస్టెంటుగా పని చేస్తున్న కిరణ్మయి ఇబ్రహీంపట్నం మండలానికి బదిలీకాగా, రెడ్డిగూడెంలో పని చేస్తున్న టెక్నికల్ అసిస్టెంటు శ్రీనివాస్ విజయవాడ రూరల్‌కు వచ్చారు.

ఇంటర్వ్యూలకు 221 మంది హాజరు



ఉంగుటూరు(గన్నవరం): స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో రెండో రోజు బుధవారం బీసీ, ఇతర కార్పొరేషన్ రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. మండలంలోని 12 గ్రామాలకు చెందిన 256 మంది దరఖాస్తుదారులకు గాను 221 మంది ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. ఎంపీడీఓ జోగేశ్వరరావు పర్యవేక్షణలో తొలుత అభ్యర్థుల సర్టిఫికెట్లను బ్యాంకర్లు, అధికారులు పరిశీలించారు. అనంతరం దరఖాస్తుదారులు పెట్టుకునే యూనిట్లు, ఇతర వివరాలకు సంబంధించి ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఇందుపల్లిలోని కెనరా బ్యాంక్, మానికొండలోని సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మేనేజర్లు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మజ్జిగ పంపిణీ



రామవరప్పాడు: విజయవాడ రూరల్ మండలం ప్రసాదంపాడులో బుధవారం వాసవీ జాగృతి ఇంటర్నేషనల్ పితృదేవోభవ క్లబ్ రామవరప్పాడు అధ్యక్షుడు జూలూరు నాగేశ్వరరావు ఆధ్వర్యంలో బాటసారులు, ప్రయాణికుల దాహార్తి తీర్చేందుకు ఉచితంగా మజ్జిగ పంపిణీ చేశారు. గ్రామంలో ఏర్పాటు చేసిన శిబిరం వద్ద ఈ మజ్జిగ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. రామవరప్పాడు పంచాయతీ కార్యాలయం పక్కన ఉన్న మండల పరిషత్ పాఠశాలలో విద్యార్థులకు పెన్నులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జూలూరు వాసవి, కశిమికోట గంగాధర్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

'చంద్ర' పోరాట పటిమ ఆదర్శనీయం



గన్నవరం: స్థానిక సీపీఐ కార్యాలయంలో భూపోరాట యోధుడు చంద్ర రాజేశ్వరరావు వర్ధంతిని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పార్టీ నియోజకవర్గ కార్యదర్శి పెద్దు వాసుదేవరావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రైతాంగ విముక్తి, శ్రామిక ప్రజల కోసం ఉద్యమించిన రాజేశ్వరరావు పోరాట పటిమ స్ఫూర్తిదాయకమన్నారు. సీపీఐ జాతీయ కార్యదర్శిగా సుదీర్ఘ కాలం పనిచేసిన ఆయన దేశవ్యాప్తంగా జరిగిన అనేక భూ పోరాటాలకు నాయకత్వం వహించారని చెప్పారు. ఆయన ఆశయాల సాధనకు కమ్యూనిస్టులు పాటుపడాలని కోరారు. పార్టీ నేతలు కట్టెవరపు విజయరావు, చాగంటిపాటి వెంకటేశ్వరరావు, నూతక్కి మోహన్‌రావు, మోహన్‌రావు, అశోక్ కుమార్, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేయాలి



ఎమ్మెల్యే ప్రసాద్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీఐటీయూ నేతలు, కార్మికులు

పెనమలూరు: తాడిగడప మున్సిపాలిటీలో పని చేస్తున్న కార్మికులను పర్మినెంట్ చేయాలని కోరుతూ సీఐటీయూ, మున్సిపాలిటీ కార్మికులు ఎమ్మెల్యే బోడె ప్రసాద్‌కు వినతిపత్రం బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ మండల కార్యదర్శి ఉప్పాడ త్రిమూర్తి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆప్కాస్ రద్దు చేయాలని చూస్తోందన్నారు. రాష్ట్రంలో కార్పొరేషన్, మున్సిపాలిటీలలో లక్షల మంది కార్మికులు ఆప్కాస్ పరిధిలో పని చేస్తున్నారన్నారు. తాడిగడప మున్సిపాలిటీలో కూడా దాదాపు 340 మంది వరకు కార్మికులు పని చేస్తున్నారని అన్నారు. మున్సిపాలిటీలో కార్మికులను పర్మినెంట్ చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. కాగా మున్సిపాలిటీలో గత కొద్ది కాలంగా రెండు సమస్యలు పెండింగ్‌లో ఉన్నాయని ఎమ్మెల్యే దృష్టికి తీసుకు వచ్చారు. హెల్త్ అలవెన్స్ రూ.6 వేలు ఇవ్వటం లేదని, గతంలో సమ్మె కాలంలో కార్మికులకు ఇవ్వాల్సిన పెండింగ్ జీతలు వెంటనే ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో కార్మిక సంఘ నేతలు మధిర ఏడుకొండలు, షేక్ మస్తాన్‌వలి, చొప్పవరపు రత్నకరుణ, బిక్షాలు, డేవిడ్‌రాజ్, జ్యోతిమేరి, వెంకటరెడ్డి, సత్యనారాయణ పలువురు పాల్గొన్నారు.

ఫీల్డ్ విధుల నుంచి విముక్తి

పెనమలూరు: సచివాలయాలలో దివ్యాంగ ఉద్యోగులకు ఫీల్డ్ విధుల నుంచి విముక్తి లభించిందని దివ్యాంగ ఉద్యోగుల అసోసియేషన్ అధ్యక్షుడు ప్రత్తిపాటి ప్రేమ్ సుధాకర్ తెలిపారు. గంగూరులో బుధవారం ఆయన వివరాలు తెలుపుతూ సచివాలయాలలో దివ్యాంగ ఉద్యోగాలకు ఫీల్డ్ విజిట్‌ల నుంచి మినహాయింపు ఇవ్వాలని చాలా కాలంగా పోరాటం చేశామన్నారు. దీనిపై జీఎస్‌డబ్ల్యూఎస్ డైరెక్టర్ ఎం.శివప్రసాద్, అసిస్టెంట్ డైరెక్టర్ సూర్యనారాయణ ఫీల్డ్ విధుల నుంచి విముక్తి కలిగిస్తూ ఉత్తర్వులు ఇచ్చారన్నారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్లకు ఆదేశాలు పంపారని తెలిపారు.

స్టడీ మెటీరియల్ పంపిణీ



గన్నవరం: స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో నిర్వహిస్తున్న పాలిసెట్- 2025 ఉచిత శిక్షణను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపాల్ వీవీ.కృష్ణమోహన్ కోరారు. ఈ మేరకు బుధవారం పాలిసెట్ శిక్షణకు హాజరవుతున్న విద్యార్థులకు ఉచిత స్టడీ మెటీరియల్‌ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అనుభవజ్ఞులైన అధ్యాపకులచే పాలిసెట్ విద్యార్థులకు ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. ఉద్యోగ జీవితంలో స్థిరపడేందుకు సాంకేతిక విద్య దోహదపడుతుందన్నారు. విభాగాధిపతులు పాల్గొన్నారు.

వర్షాలకు దెబ్బతిన్న పొగాకును ప్రభుత్వం కొనాలి



దెబ్బతిన్న పొగాకును పరిశీలిస్తున్న జెడ్పీటీసీ సభ్యురాలు అన్నవరపు ఎలిజబెత్ రాణి

గన్నవరం రూరల్: అకాల వర్షం వల్ల నల్లబడిన పొగాకును ప్రభుత్వమే కొనుగోలు చేయాలని జిల్లా కలెక్టర్‌కు జెడ్పీటీసీ సభ్యురాలు అన్నవరపు ఎలిజబెత్ రాణి విజ్ఞప్తి చేశారు. బుధవారం మండలంలోని బీబీగూడెంలో దెబ్బతిన్న పొగాకును రైతులతో కలిసి ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఎలిజబెత్ రాణి మాట్లాడుతూ ఎకరానికి లక్ష పెట్టుబడి పెట్టి పొగాకును రైతులు సాగు చేశారని, అకాల వర్షానికి పంట దెబ్బతిందని తెలిపారు. వారం రోజుల్లో పంట చేతికొస్తుందని అనుకున్న సమయంలో అకాల వర్షం నష్టపరిచిందన్నారు. ప్రభుత్వం పొగాకును కొనుగోలు చేయాలని, లేకుంటే రైతులకు నష్ట పరిహారం చెల్లించాలన్నారు. రైతుల బాధలు వర్ణాతీతంగా ఉన్నాయని చెప్పారు. లాభసాటిగా ఉంటుందని బార్లి పొగాకును వేస్తే అకాల వర్షానికి తడిసిపోయి నల్లబారిందని రైతులను ఆదుకోవాలని కోరారు. కాట్రు ధర్మారావు, తమ్మిశెట్టి రఘుబాబు, గొంది శోభనచలపతిరావు తదితరులు పాల్గొన్నారు.

అదనపు రుసుం అడిగితే ఫిర్యాదు చేయండి

పెనమలూరు: మీసేవా కేంద్రాలు, గ్రామ/వార్డు సచివాలయాలలో ఆన్‌లైన్‌లలో డాక్యుమెంట్లు నమోదు చేసుకోవటానికి ప్రభుత్వం ప్రకటించిన రుసుము మాత్రమే చెల్లించాలని తహసీల్దార్ గోపాలకృష్ణ తెలిపారు. ఆయన బుధవారం వివరాలు తెలుపుతూ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మ్యుటేషన్, పాస్‌బుక్‌లకు రుసుము రూ.150, భూ కొలతల సర్వేసుకు రుసుము రూ. 550 మాత్రమే చెల్లించాలన్నారు. ఇంతకన్నా ఎక్కువ రుసుము డిమాండ్ చేస్తే వెంటనే తమకు ఫిర్యాదు చేయాలని సూచించారు.

లైంగిక ఆరోపణలపై దర్యాప్తు చేపట్టాలని వినతి

హనుమాన్‌జంక్షన్ రూరల్: కృష్ణా మిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు లైగింక వేధింపులకు పాల్పడినట్లుగా గుర్తు తెలియని మహిళ విడుదల చేసిన వీడియోపై సమగ్ర దర్యాప్తు చేపట్టాలని పలువురు పాల సహకార సొసైటీల అధ్యక్షులు హనుమాన్‌జంక్షన్ పోలీస్‌స్టేషన్‌లో బుధవారం ఫిర్యాదు చేశారు. మహిళల పట్ల అగౌరవంగా ప్రవర్తించినట్లుగా ఆరోపణలు చేస్తూ వ్యక్తిగత, యూనియన్ ప్రతిష్టకు భంగం కలిగించే వ్యాఖ్యలు వీడియోలో చేశారని పేర్కొన్నారు. ఈ వీడియో విడుదల వెనుక అనుమానం ఉందని, సదురు గుర్తు తెలియని మహిళతో పాటుగా సహకరించిన వ్యక్తులను విచారించాలని విజ్ఞప్తి చేశారు.

మరోసారి రచ్చకెక్కిన టీడీపీ వర్గపోరు

గన్నవరం: మండలంలోని అల్లాపురం గ్రామంలో బుధవారం జరిగిన సీసీ డ్రెయిన్ శంకుస్థాపన కార్యక్రమంతో టీడీపీలోని వర్గపోరు మరోసారి రచ్చకెక్కింది. ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావుతో విభేదించిన టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు జాస్తి వెంకటేశ్వరరావుతో డ్రెయిన్‌జీ పనులకు గ్రామ పార్టీ నేతలు కొబ్బరికాయ కొట్టించారు. ఈ సంఘటన ఎమ్మెల్యే యార్లగడ్డకు తీవ్ర ఆగ్రహాన్ని తెప్పించింది. దీనికి పంచాయతీ కార్యదర్శిని బాధ్యుడిని చేసి శాఖాపరమైన చర్యల నిమిత్తం ఎమ్మెల్యే ఉన్నతాధికారులకు మౌఖిక ఆదేశాలు ఇవ్వడం మరింత వివాదానికి దారితీసింది. వివరాలిలా ఉన్నాయి. గ్రామంలోని ఎస్సీ కాలనీలో సీసీ డ్రెయిన్ పనుల శంకుస్థాపనకు ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావును ఇటీవల గ్రామ పార్టీ నేతలు ఆహ్వానించారు. బిజీ షెడ్యూల్ వల్ల యార్లగడ్డ రావడం కుదరదని ఎమ్మెల్యే ఆఫీస్ సమాచారం మేరకు గ్రామ పార్టీ నేతలే శంకుస్థాపకు ఏర్పాట్లు చేసుకున్నారు. పంచాయతీ కార్యదర్శి ఉమామహేశ్వరరావుతో సంబంధం లేకుండా మండల పార్టీ అధ్యక్షుడు జాస్తి వెంకటేశ్వరరావును పిలిపించి డ్రెయిన్ పనులకు శంకుస్థాపన చేయించారు. ఎమ్మెల్యేకు వ్యతిరేకంగా పార్టీ అధిష్టానానికి ఫిర్యాదులు చేస్తున్న జాస్తి శంకుస్థాపన చేయడం యార్లగడ్డకు తీవ్ర ఆగ్రహానికి గురిచేసింది. దీనికి బాధ్యులైన గ్రామ పార్టీ నేతలను వదిలేసి పంచాయతీ కార్యదర్శిని సస్పెండ్ చేసేందుకు సిద్ధమవడం చర్చనీయాంశమైంది. పార్టీలో వర్గపోరు చివరికి ఓ అధికారి బలైపోవాల్సిన పరిస్థితి వచ్చిందంటూ అధికారులు సైతం ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చివరికి ఈ పంచాయతీ విజయవాడలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయానికి చేరడంతో గ్రామ పార్టీ నేతలు ఈఓను వెంటబెట్టుకుని అక్కడికి పరుగులు పెట్టడం గమనార్హం.

వైభవంగా అయ్యప్ప కోటి నామ జప మహాయజ్ఞం



ఊరేగింపులో నిర్వాహకులు, అర్చకులు



హోమంలో పాల్గొన్న ఉభయదాతలు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): కొత్తపేట ఆంజనేయ వాగు సెంటర్‌లోని శ్రీ వీరాంజనేయ స్వామి వారి దేవస్థానంలో బుధవారం నుంచి అయ్యప్ప కోటి నామ జప మహాయజ్ఞం ప్రారంభమైంది. శ్రీమణికంఠ సేవా సమతి వ్యవస్థాపకుడు బెవర రాము గురుస్వామి ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు మహా యజ్ఞాన్ని నిర్వహిస్తున్నారు. కార్యక్రమంలో భాగంగా బుధవారం ఉదయం అయ్యప్ప స్వామి విగ్రహం, కలశాలతో ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్నారు. ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన వేదికపై స్వామి వారి ఉత్సవ మూర్తిని ప్రతిష్టించి పూజా కార్యక్రమాలు, హోమాలను నిర్వహించారు. పూజా కార్యక్రమాలను బెవర రాము పర్యవేక్షించగా, దేవీ లక్ష్మీనారాయణ చార్యులు, విన్నకోట శ్రీనివాసరావు శర్మ వైభవంగా జరిపించారు. సాయంత్రం శ్రీలలితా సహస్ర నామ కుంకుమార్చన జరిగాయి. పూజా కార్యక్రమాల్లో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని తరలించారు. గురువారం సాయంత్రం 6.30 గంటలకు అయ్యప్ప స్వామి వారి మహా పడిపూజ, భజన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు గురుస్వామి బెవర రాము పేర్కొన్నారు. 11వ తేదీ ఉదయం అయ్యప్ప స్వామి పుట్టిన రోజును పురస్కరించుకుని ప్రత్యేక పూజా కార్యక్రమాలు, అనంతరం మహా పూర్ణాహుతితో మహాయజ్ఞం పూర్తవుతుందని చెప్పారు.

కొత్తపేట పరిధిలో యువకులకు కౌన్సెలింగ్



చిట్టినగర్(విజయవాడపశ్చిమ): కేఎల్ రావు పార్కు, వీఎంసీ కాలనీ పరిసరాల్లో తిరుగుతున్న యువకులకు కొత్తపేట సీఐ కొండలరావు బుధవారం కౌన్సెలింగ్ ఇచ్చారు. గంజాయి, ఈవ్ టీజింగ్‌కు వ్యతిరేకంగా కొత్తపేట పోలీసులు బుధవారం స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించారు. కేఎల్‌రావు పార్కు పరిసరాల్లో ఉన్న యువకుల వివరాలను ఆరా తీయడంతో పాటు తనిఖీ చేశారు. రోడ్లపైన, ఆటోలలో గుంపులు గుంపులుగా కూర్చుని ప్రజలకు ఇబ్బంది కలిగించినా, సంఘ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడిన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ప్రణాళిక ప్రకారం పౌష్టికాహారం ఇవ్వాలి



కానూరులో పౌష్టికాహారంపై అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్ విజయలక్ష్మి

పెనమలూరు: అంగన్‌వాడీ కేంద్రాలలో పౌష్టికాహారం తల్లీబిడ్డలకు అందించే విషయంలో ప్రత్యేక శ్రద్ధ చూపాలని యనమలకుదురు సెక్టార్ సూపర్‌వైజర్ కల్యాణీవర్మ అన్నారు. గ్రామంలో శివలింగేశ్వర్‌నగర్ ప్రాంతంలో బుధవారం పౌష్టికాహార పక్షోత్సవాలలో భాగంగా పౌష్టికాహారంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సూపర్‌వైజర్ కల్యాణీవర్మ మాట్లాడుతూ తల్లి గర్భిణి అయిన తరువాత బిడ్డ పుట్టిన 2 సంవత్సరాల వరకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

కానూరులో..

కానూరులో జరిగిన పౌష్టికాహార పక్షోత్సవాలలో భాగంగా అంగన్‌వాడీ కార్యకర్తలు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కానూరు సెక్టార్ సూపర్‌వైజర్ విజయలక్ష్మి మాట్లాడుతూ చిన్నారుల్లో పౌష్టికాహార లోపం ఉంటే వెంటనే గుర్తించాలన్నారు. పిల్లల్లో ఊబకాయం తగ్గించి ఆరోగ్యంగా ఉంచే విధంగా జీవన శైలిని అలవాటు చేయాలని సూచించారు. వెయ్యి రోజుల వరకు తల్లి, బిడ్డకు పౌష్టికాహారం అందే విధంగా ప్రణాళిక రూపొందించుకోవాలని సూచించారు.

గన్నవరం: స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషణ్ పక్వాడ పక్షోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులకు వెయ్యి రోజుల కార్యచరణ గురించి ఐసీడీఎస్ ప్రాజెక్ట్ సీడీపీఓ పి.వెంకటలక్ష్మి అవగాహన కల్పించారు. గర్భిణులు మొదటి నెల నుంచి మంచి పోషక విలువలు కలిగిన ఆహారం తీసుకోవాలని చెప్పారు. దీనివల్ల రక్తహీనత, ఇతర అనారోగ్య సమస్యలు ఉత్పన్నం కావని తెలిపారు. ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ శారమ్మ, డాక్టర్ శ్రీదేవి, సూపర్‌వైజర్ నాగపద్మావతి, పలువురు అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉంగుటూరులో..

ఉంగుటూరు సచివాలయంలో పౌష్టికాహార పక్షోత్సవాలను నిర్వహించారు. గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం, ఆరోగ్య పరంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఐసీడీఎస్ సూపర్‌వైజర్ దుర్గాదేవి వివరించారు. ఏఎన్ఎంలు శ్రీలక్ష్మి, శశిరాజకళ, అంగన్‌వాడీ కార్యకర్తలు భూలక్ష్మి, రోజా, నాగవల్లి తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్యం మెరుగుకు చర్యలు

రామవరప్పాడు: గ్రామంలో పారిశుద్ధ్యం మెరుగుపరిచేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని రామవరప్పాడు పంచాయతీ కార్యదర్శి ఘంటా రామ్మోహనరావు తెలిపారు. విజయవాడ రూరల్ మండలం రామవరప్పాడులో బుధవారం సైడు డ్రెయిన్లను పూడుకతీయించి, చెత్తను తొలగించారు. రామ్మోహనరావు మాట్లాడుతూ జాతీయ రహదారికి ఇరువైపులా ఫుట్‌పాత్‌లు, హైవేపై పారిశుద్ధ్యం మెరుగు పరుస్తున్నట్లు తెలిపారు. మురుగు నీరు పారుదలకు నోచుకోని డ్రెయిన్లను గుర్తించి పూడిక తీయిస్తున్నామన్నారు. అంతర్గత రహదారుల్లోని చెత్త, వ్యర్థాలను పారిశుద్ధ్య సిబ్బందిచే తొలగించి డంపింగ్‌యార్డ్‌కు తరలిస్తున్నట్లు చెప్పారు. ఖాళీ స్థలాలు, మురుగు నిల్వ ఉన్న ప్రాంతాలు, అంతర్గత రహదారుల్లో దోమల మందు పిచికారీ చేయించి బ్లీచింగ్ చల్లిస్తున్నామని తెలిపారు. బల్లెంవారి వీధిలోని శ్మశానవాటిక వద్ద చెత్త నిల్వ ఉంచకుండా ఎప్పటి కప్పుడు తొలగిస్తున్నట్లు చెప్పారు. పారిశుద్ధ్యంపై సమస్యలు ఎదురైతే పంచాయతీ కార్యాలయంలో ఫిర్యాదు చేయాలని సూచించారు.

గ్యాస్ ధరలు తగ్గించాలని కోరుతూ ధర్నా



పోరంకి సెంటర్‌లో గ్యాస్ బండలతో ధర్నా చేస్తున్న సీపీఎం నేతలు

పెనమలూరు: పెంచిన గ్యాస్ ధరలు వెంటనే తగ్గించాలని డిమాండ్ చేస్తూ సీపీఎం ఆధ్వర్యంలో బుధవారం పోరంకి సెంటర్‌లో గ్యాస్ బండలను ప్రదర్శిస్తూ ధర్నా చేశారు. ఈ సందర్భంగా మండల సీపీఎం కార్యదర్శి షేక్ కాశిం మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ ప్రజా వ్యతిరేక విధానాలకు పాల్పడుతోందని ఆరోపించారు. గ్యాస్ బండ ధర రూ.50 పెంచి పేద, మధ్య తరగతి కుటుంబాలపై భారం మోపారన్నారు. బీజేపీ పాలనలో అన్ని రకాల ధరలు పెరిగిపోతున్నాయని ఆందోళణ వ్యక్తం చేశారు. మండల సీఐటీయూ కార్యదర్శి ఉప్పాడ త్రిమూర్తి కేంద్రంలో ఎన్డీఏ ప్రభుత్వం గ్యాస్ ధర, డీజిల్ పెట్రోల్ ధరలు, పాల ధరలు పెంచిందని విమర్శించారు. ధరలు పెంచుకుంటూ పోతే ప్రజలు ఎలా జీవించాలని ప్రశ్నించారు. ప్రజల కష్టాలను ఎన్డీఏ గాలికి వదిలేసిందని ఆరోపించారు. రాష్ట్రంలో కూటమి పాలన దారుణంగా మారిందన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నేతలు షేక్ మస్తాన్‌వలి, పాపారావు, పి.సత్యనారాయణ, వెంకటరెడ్డి, పుసులూరి పాతాళలక్ష్మి, సీహెచ్.భవాని, ఐద్వా నేతలు, ప్రజా సంఘాల నేతలు పాల్గొన్నారు.

పాఠశాలలో క్రీడా వసతుల కల్పనకు చర్యలు

డీఎస్‌డీఓ ఝాన్సీలక్ష్మి



గన్నవరం క్రీడా ప్రాంగణాన్ని పరిశీలిస్తున్న డీఎస్‌డీఓ ఝాన్సీలక్ష్మి

గన్నవరం: స్థానిక జెడ్పీ బాలుర హైస్కూల్ క్రీడా ప్రాంగణాన్ని బుధవారం జిల్లా క్రీడల అభివృద్ధి అధికారిణి ఝాన్సీలక్ష్మి సందర్శించారు. క్రీడా ప్రాంగణంలో కొత్తగా నిర్మించనున్న బాస్కెట్‌బాల్, టాయిలెట్స్ నిర్మాణానికి కేటాయించిన స్థలాలను పరిశీలించారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులు ఆడుకునేందుకు అనువైన వసతులను కల్పిస్తున్నట్లు ఆమె తెలిపారు. దీంట్లో భాగంగా జిల్లాలోని క్రీడా ప్రాంగణాలను పరిశీలించి క్రీడా వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. శాప్ ఏఈ ప్రశాంత్, పాఠశాల హెచ్ఎం జీవీ.రవిబాబు, వ్యాయామ ఉపాధ్యాయులు డి. నాగరాజు, రిటైర్డ్ ఫిజికల్ డైరెక్టర్లు టీఎస్ఆర్‌కే. ప్రసాద్, సత్యనారాయణ పాల్గొన్నారు. అనంతరం ఉంగుటూరు మండలం ఆత్కూరు జెడ్పీ హైస్కూల్ ప్రాంగణంలోని ఇండోర్ స్టేడియంను ఝాన్సీలక్ష్మి పరిశీలించారు.

స్టెల్లాలో క్యాంపస్ ఇంటర్వ్యూలు



ఉద్యోగాలు పొందిన విద్యార్థినులు

పటమట(విజయవాడతూర్పు): పటమటలోని స్టెల్లా కళాశాలలో ప్లేస్‌మెంట్ సెల్ ఆధ్వర్యంలో డిగ్రీ, పీజీ విద్యార్థినులకు బుధవారం క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించారు. నైస్ ఎడ్యుకేషన్ బ్లూస్టార్, హెచ్‌డీబి ఫైనాన్స్, ఫాక్ స్కాన్, స్పీకింగ్ ట్రీ, జీఐసీఈ, టెక్ అవుట్ తదితర సంస్థలు విద్యార్థినులకు కమ్యూనికేషన్, స్కిల్స్, గ్రూప్ డిస్కషన్ వంటి అంశాలపై ఇంటర్వ్యూలు నిర్వహించి 150 మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించారు. ఇంటర్వ్యూలను కళాశాల ప్లేస్‌మెంట్ సెల్ అధికారులు లక్ష్మీ హేమ, అనుపమ పర్యవేక్షించారు. ఉద్యోగాలు పొందిన విద్యార్థినులను ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ జసింత క్వాడ్రస్, అధ్యాపకులు అభినందించారు.

భర్త అదృశ్యంపై ఫిర్యాదు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): తన భర్త కనిపించడం లేదంటూ వివాహిత కొత్తపేట పోలీసులకు ఫిర్యాదు చేయగా బుధవారం కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం నాగమ్మ సత్రంకొండపై మల్లిపూడి దుర్గాభవానీ, వీర మహేష్ నెహ్రూలు నివాసం ఉంటున్నారు. దుర్గా భవానీకి గతంలో వివాహం కాగా విభేదాల కారణంగా విడాకులు తీసుకుంది. 2014లో వీర మహేష్ నెహ్రూను ప్రేమించి రెండో వివాహం చేసుకుంది. ఈ నెల 1వ తేదీన వీర మహేష్ నెహ్రూ నల్లజర్లలో ఉంటున్న తన తల్లికి అనారోగ్యంగా ఉందని చెప్పి వెళ్లాడు. అప్పటి నుంచి ఫోన్ స్విచ్చాఫ్ వస్తుంది. బుధవారం నల్లజర్లలో ఉంటున్న బంధువులకు ఫోన్ చేయగా, వీర మహేష్ ఊరు రాలేదని చెప్పారు. దీంతో దుర్గాభవానీ పోలీసులకు ఫిర్యా దు చేసింది. దీనిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు పేర్కొన్నారు.